
45వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు


ఈస్ట్ పార్క్ జంక్షన్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న కె.కె.రాజు

సేవకుడిలా ఉంటా

- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- 45, 51 వార్డుల్లో ఎన్నికల ప్రచారం

తాటిచెట్లపాలెం/మద్రిపాలెం: ఉత్తర నియోజకవర్గం నుంచి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నాయకుడిలా కాకుండా.. ప్రజా సేవకుడిలా ఉంటానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హామీ ఇచ్చారు. 45వ వార్డు నరసింహనగర్‌లో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ఐదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో తాను నియోజకవర్గంలో రూ.435 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మన పక్కనే దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఇనార్బిట్ మాల్ నిర్మాణం జరుగుతోందని, ఇది పూర్తయితే స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఎన్నికలలో ఎమ్మెల్యేగా తనకు, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, రాష్ట్ర యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాయుడు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మొద్దు

ప్రతిపక్షాలు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని, రాష్ట్ర ప్రజలందరికీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని, మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిని చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. 51వ వార్డులో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ దరి మారియట్ హోటల్ వద్ద పైడితల్లి అమ్మవారి ఆలయంలో పూజలు చేసి, ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మహిళలు కె.కె.రాజుపై పూల వర్షం కురిపించి హారతులు పట్టారు. నాయకులు గజమాలతో సత్కరించారు. అంబేడ్కర్ కాలనీ, ఇందిరమ్మ గృహాలు, వుడా కాలనీ, ఏకలవ్య కాలనీ, కళింగనగర్ వరకు పాదయాత్రగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేశారు. వాంబే కాలనీ వద్ద కె.కె.రాజు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఒక్కసారైనా బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు వచ్చి మీ సమస్యలను అడిగి తెలుసుకున్నారా అని ప్రజలను అడిగారు. ఎన్నికలు రావడంతో ఇప్పుడు వచ్చి టిడ్కో ఇళ్లు విరగ్గొట్టి మళ్లీ బాగుచేయిస్తానని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడానికేనన్నారు.

జగన్ ప్రభుత్వంలో పేదల సంక్షేమానికి పెద్దపీట

ఈస్ట్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన సభలో కె.కె.రాజు మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వంలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. 2019లో జగన్ ముఖ్యమంత్రి అయ్యే సమయానికి దేశవ్యాప్తంగా ఇచ్చిన నివేదికలో పేదరిక నిర్మూలనలో 17 స్థానంలో ఉన్న మన రాష్ట్రం.. గడిచిన ఐదేళ్లలో రెండేళ్లు కరోనా కాలం ఉన్నా సరే.. ప్రస్తుతం 3వ స్థానంలో ఉందని చెప్పారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా జగన్‌ను ఓడించలేరన్నారు. ఈ సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్‌సీపీకి అత్యధిక మెజారిటీతో విజయం అందించాలని కె.కె.రాజు కోరారు. స్థానికులు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, సీనియర్ నాయకులు జి.వి.రవిరాజు, పశ్చిమ ఎన్నికల పరిశీలకులు పేడాడ రమణకుమారి, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, 51వ వార్డు సీనియర్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

- విజయోస్తు


పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద కె.కె.రాజుకు హారతులు పడుతున్న మహిళలు

- గెలిపించండి.. సేవ చేస్తా


నరసింహనగర్‌లో ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థిస్తున్న కె.కె.రాజు

➡ 50వ వార్డు మురళీనగర్ సెక్టార్ 6, 7 పరిసర ప్రాంతాల్లో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు.

‘ఉత్తర’ బరిలో 15 మంది

2 నామినేషన్ల ఉపసంహరణ

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖ ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి దాఖలై ఆమోదం పొందిన మొత్తం 17 నామినేషన్లకు గానూ ఇద్దరు ఉపసంహరించుకున్నా రు. ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు ఉన్నట్లు ఉత్తర రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్వో) డి.అఖిల సోమవారం వెల్లడించారు. సుమ కమ్మిల, చింతల మల్లికార్జునరావు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని చెప్పారు. ఉత్తర నియోజకవర్గం నుంచి 24 మంది అభ్యర్థులు 47 నామినేషన్లు వేశారు. దీనిలో ఏడు నామినేషన్లను తిరస్కరించారు. మొత్తం 15 మందిలో ఏడుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు ఉన్నారు. ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, బీజేపీ అభ్యర్థులు అసెంబ్లీ బరిలో నిలిచారు.

ఎన్నికల్లో పోటీపడుతున్న అభ్యర్థులు వీరే..

అభ్యర్థి	పార్టీ పేరు	గుర్తు
1. కమ్మిల కన్నప రాజు (కె.కె.రాజు)	వైఎస్సార్‌సీపీ	ఫ్యాన్
2. పెనుమత్స విష్ణుకుమార్‌రాజు	బీజేపీ	కమలం
3. రామారావు లంకరాజు	కాంగ్రెస్	హస్తం
4. వెంకటలక్ష్మీనారాయణ(జె.డి.)	జై భారత్ నేషనల్ పార్టీ	బ్యాటరీ టార్చ్
5. పెద్దాడ కనకమహాలక్ష్మి	బహుజన్ సమాజ్ పార్టీ	ఏనుగు
6. గుంపల శరత్‌బాబు	సమాజ్ వాది పార్టీ	బైసైకిల్ పంపు
7. పి.జగదీష్	జాతీయ జనసేన పారీ	పెన్ను స్టాండ్
8. చింతాడ సూర్యం	నవభారత్ నిర్మాణ్ సేవా పార్టీ	టెలివిజన్
9. కోనేటి ఈశ్వర వీరభద్రాచారి	ఇండిపెండెంట్	ఉంగరం
10. చప్పా రామునాయుడు	ఇండిపెండెంట్	బకెట్
11. బొడ్డు వరాహ సత్యశ్రీనివాస్	ఇండిపెండెంట్	విజిల్
12. బోర్రా రమేష్	ఇండిపెండెంట్	గ్యాస్ సిలండర్
13. రోణంకి చలపతిరావు	ఇండిపెండెంట్	వజ్రం
14. వద్ది శిరీష	ఇండిపెండెంట్	గాజు గ్లాస్
15. యలమంచిల సాహితి	ఇండిపెండెంట్	మైక్

వైఎస్సార్‌సీపీలో 100 మంది చేరిక


బొత్స ఝాన్సీ, కె.కె.రాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వ్యాపారవేత్త శ్రీనివాసరెడ్డి అనుచరులు

సీతంపేట: వ్యాపారవేత్త, శివరామిరెడ్డి స్వీట్స్ అధినేత శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆయన అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని శ్రీనివాసరెడ్డి ఇంట్లో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమక్షంలో సుమారు 100 మంది పార్టీలో జాయిన్ అయ్యారు. వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో శివప్రసాద్‌రెడ్డి, బుజ్జి, వాసు, అప్పలరాజు, భూపాల్‌రెడ్డి, గాయత్రి, కుమారి, కీర్తన తదితరులు ఉన్నారు

పార్టీలోకి టీడీపీ, బీజేపీ నాయకులు

సీతమ్మధార: జీవీఎంసీ 55వ వార్డు నాయకుడు బద్రీ ఆధ్వర్యంలో ధర్మానగర్ శివాలయానికి చెందిన పలువురు టీడీపీ, బీజేపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో వారికి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ విజయానికి కష్టపడి పనిచేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా అందరికీ తెలియపరచాలని కోరారు. కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ, సీనియర్ నాయకుడు జి.వి.రవిరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.


కె.కె.రాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, బీజేపీ నాయకులు

క్లుప్తంగా

సాయి మందిరంలో అన్నసమారాధన


అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని షిర్డీసాయి ధ్యాన మందిరం 15వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో బొడ్డేటి కిరణ్, జేసీఎస్ కన్వీనర్ బులుసు జగదీష్, ధ్యాన మందిర కమిటీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చర్చిలో కె.కె.రాజు ప్రార్థనలు


చర్చిలో ప్రార్థన చేస్తున్న కె.కె.రాజు

మద్రిపాలెం: మురళీనగర్ సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ చర్చిను సోమవారం వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాదర్ రెవరెండ్ రాజశేఖర్ ఆయనకు ఆశీస్సులు అందజేశారు.

టెన్త్ టాపర్‌కు సత్కారం


హేమంత్‌ను సత్కరిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధులు

మురళీనగర్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిన రెడ్డి హేమంత్‌ను ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సోమవారం ఘనంగా సత్కరించింది. మురళీనగర్ బాలభాను పాఠశాలలో చదివిన ఈ విద్యార్థి 596 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా మురళీనగర్‌కు చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ శాఖ ఆధ్వర్యంలో హేమంత్‌ను శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎంజీ శంకరనారాయణ్, అశ్విని పటేల్, ఎంఆర్‌కే రంగారావు, ఎ.రాధారాణి, ఎస్.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతుబజార్‌లో తనిఖీలు

సీతంపేట: లీగల్ మెట్రాలజీ డిస్ట్రిక్ట్ కంట్రోలర్ కె.టి.రవికుమార్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కంట్రోలర్ పి.డి.వి.అప్పలరాజు, వేయింగ్ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు సోమవారం నరసింహనగర్ రైతుబజార్‌లో తనిఖీలు చేపట్టారు. ధర్మకాటా ఏర్పాటు చేసి వినియోగదారులు తీసుకునే కూరగాయల బరువు సరిగా ఉన్నది లేనిదీ పరిశీలించారు. రైస్ బ్యాగుల బరువు తనిఖీ చేశారు. రైతులు, డ్వాక్రా వ్యాపారులు, కిరాణా వ్యాపారులు గడువులోగా కాటాలకు సీళ్లు వేయించుకోవాలని సూచించారు. రైతుబజార్ ఈవో పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: నార్త్ సింహాచలం రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు విశాఖ జీఆర్పీ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలిలా.. ఆదివారం సింహాచలం నార్త్ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడని సమాచారం అందడంతో కేసు నమోదు చేశారు. ఇతడి వయసు 28–30 ఏళ్లు, ఎత్తు సుమారు 5.6 అడుగులు, చామనఛాయ రంగు శరీరం కలిగి, వైట్ షర్ట్, నల్లని గీతలు గల లోయర్ ధరించి ఉన్నాడు. జీఆర్పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వే పోలీసులకు గానీ 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ ఎస్‌ఐ కోరారు.

మీలో ఒకడిగా ఉంటా.. దీవించండి

- హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తా..
- పండ్లు, కూరగాయల వ్యాపారులకు కె.కె.రాజు హామీ


ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్ మర్చంట్స్ అసోసియేషన్ల సమావేశంలో మాట్లాడుతున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: ×నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండడం కాదు.. మీలోనే ఒకడిగా ఉంటాను¯ అని వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మాటిచ్చారు. తాటిచెట్లపాలెం పరిసర ప్రాంతాల్లోని ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్ మర్చంట్స్ అసోసియేషన్లతో తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్‌లోని 45వ వార్డు ఎన్నికల ప్రచార కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతమ్మధార రైతుబజార్ వద్ద నుంచి ఇటు సత్యం జంక్షన్ వరకు.. అటు అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ప్రత్యేక హాకర్స్ జోన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేసి వారికి లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో కూడా హాకర్స్, చిరువ్యాపారుల కోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించి హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ గెలిచిన నాయకులు ఐదేళ్లు మొహం చాటేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నిరంతరం ప్రజలతోనే ఉన్నానని తెలిపారు. గతంలో గెలిచిన విష్ణుకుమార్‌రాజు కూడా వానాకాలంలో బయట కొచ్చే వానపాములా ఎన్నికలు రాగానే మళ్లీ జనంలోకి వచ్చారని ఎద్దేవా చేశారు. నిరంతరం ప్రజల్లో ఉండే నాయకుడు కావాలో.. అప్పుడప్పుడు వచ్చే నాయకులు కావాలో మీరే ఆలోచించుకోవాలన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా బొత్స ఝాన్సీకి రెండు ఓట్లు వేసి మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా దీవించాలని, మీరంతా మరికొంత మందికి చెప్పి వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయించాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు, వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోకు, 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, అసోసియేషన్ ప్రతినిధులు శంకర్, లక్ష్మణ్, వెంకటేష్, తిరుపతిరావు, పులపా రవీంద్రనాథ్ ఠాగూర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మూడు విడతల్లో ఎన్నికల ఖర్చు చూపించాలి


ఆర్వో అఖిల

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు మూడు విడతలుగా ఎన్నికల ఖర్చుల పరిశీలకునిచే విధిగా తనిఖీ చేయించుకోవాలని ఉత్తర ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్వో) డి.అఖిల తెలిపారు. సోమవారం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మే 1న మొదటి విడత, 6న రెండో విడత, 11వ తేదీన మూడో విడతలో ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ఖర్చు పరిశీలకులకు ప్రతి అభ్యర్థి తన ఎన్నికల ఖర్చు వివరాలను చూపించుకోవాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, నామినేషన్ వేసిన ఏప్రిల్ 30వ తేదీ వరకు వారికి ఇచ్చిన అకౌంట్స్ రిజిస్టర్, నమోదు చేసే రసీదులు, ఓచర్లు, బ్యాంక్ పాస్ పుస్తకం మొదటి విడత మే 1న అభ్యర్థి లేక ఆయన తరఫున ఆథరైజ్డ్ ఏజెంట్ జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ఎన్నికల ఖర్చుల పరిశీలకుడితో ఖర్చు రిజిస్టర్‌ను తనిఖీ చేయించుకోవాలని చెప్పారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి


శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అమరావతి విశ్వసాహితి ప్రతినిధులు

మురళీనగర్: విప్లవ కవి, సినీ గీత రచయిత శ్రీశ్రీ జయంతిని అమరావతి విశ్వసాహితి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మురళీనగర్‌లో ఘనంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు అత్యధికంగా పాల్గొని శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక అంతరాలను రూపుమాపేందుకు, సామాజిక సమాత్వం సాధించేందుకు శ్రీశ్రీ కలం నుంచి జాలువారిన కవితలు, రచనలను వారు వివరించారు. అమరావతి విశ్వసాహితి సంస్థ ప్రతినిధులు సీహెచ్ చినసూర్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




మద్రిపాలెం: 53వ వార్డులో కె.కె.రాజుకు ఓటు వేయాలని కరపత్రాన్ని అందిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ, గుజ్జు వెంకటరెడ్డి తదితరులు


మద్రిపాలెం: 49వ వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును గెలిపించాలని ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు


సీతంపేట: 25వ వార్డు సీతంపేటలో వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

చోరీ సొత్తు రికవరీ


- జీఆర్పీ అదుపులో నిందితులు


నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: వివిధ రైళ్లు, రైల్వేస్టేషన్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను సోమవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం పోలీసులు పట్టుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. సోమవారం జీఆర్పీ ఎస్‌ఐ వి.బాలాజీరావు, హెడ్ కానిస్టేబుల్ ఎల్.ఉదయ్‌భాస్కర్, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ జేకే మీనాలు తమ తమ సిబ్బందితో విశాఖ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా రైళ్లలో దొంగతనాలు చేసే ముఠా సభ్యులు పట్టుబడ్డారు. పల్లపు ముత్యాలు, పల్లపు మురళీ, గొబ్బూరు శ్రీనివాసరావు అనే గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన దొంగలముఠా సభ్యుల నుంచి సుమారు 16 గ్రాముల బంగారు గొలుసును, రూ.15 వేల నగదును రికవరీ చేశారు. వీరు ఈ వస్తువులు, నగదును ప్రయాణికుల నుంచి చోరీ చేసినట్లుగా అంగీకరించడంతో చోరి సొత్తును రికవరీ చేసి, నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.



సముద్రాలపై అవగాహన అవసరం


పోటీల విజేత మధురానగర్ స్కూల్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

ఏయూ క్యాంపస్: సముద్రాలపై అవగాహన కల్పించడం, వాటి సంరక్షణ దిశగా ప్రజలను నడిపించడం ఎంతో అవసరమని గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య కె.ఎస్.కృష్ణ అన్నారు. బీచ్ రోడ్డులోని ఐసీఏఆర్–సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీష్ టెక్నాలజీ 67వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సముద్ర జీవావరణంపై ప్రజల్లో చైతన్యం పెంచాలని, వాటి ప్రాముఖ్యతను తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నం ఐసీఏఆర్–సీఐఎఫ్‌టీ సైంటిస్ట్ ఇన్‌చార్జి డాక్టర్ యు.శ్రీధర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో తమ సంస్థ సాధిస్తున్న ప్రగతిని, విశేషాలను వివరించారు. నిబద్ధత ప్రగతి, ఆవిష్కరణ దిశగా సాగిస్తున్న అభివృద్ధిని నిదర్శనంగా 67వ వ్యవస్థాపక దినోత్సవం నిలుస్తోందన్నారు. ఆరు దశాబ్దాలుగా ఎంతో ముఖ్యమైన పరిశోధనలను తమ కేంద్రం నిర్వహించిందన్నారు. ఐసీఏఆర్–సీఎంఎఫ్ఆర్ఐ ప్రాంతీయ కేంద్రం రీజినల్ హెడ్ డాక్టర్ జోయ్ కిజకుడన్ మాట్లాడుతూ చేపల పెంపకం పరిశ్రమలకు, ఈ రంగానికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు బ్యాలన్సింగ్ ఓషన్ హెల్త్ అండ్ హ్యూమన్ నీడ్స్ అంశంపై పోటీలు నిర్వహించారు. మధురానగర్ జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. వారికి అతిథులు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ప్రశాంతంగా ఓటేయండి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఎన్నికల వేళ ప్రశాంతంగా ఓటు వేయాలని, అల్లర్లు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ సూచించారు. సోమవారం సాయంత్రం రైల్వే న్యూకాలనీ, శ్రీనివాసనగర్, తాటిచెట్లపాలెం ఓటర్ ట్యాంక్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. గొడవలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

